క్లుప్తంగా

కుమార్‌రాజాకు అభినందనలు



శెట్టిబత్తుల కుమార్‌రాజా, అన్నవరం సర్పంచ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి

అన్నవరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజాకు గురువారం పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. పార్టీకి గత ఆరేళ్లుగా కుమార్‌రాజా చేస్తున్న సేవలకు గుర్తింపు లభించిందని ప్రశంసించారు. గ్రామ ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, సరమర్ల మధుబాబు, బలువు రాంబాబు, పంచాయతీ వార్డు సభ్యులు ఆశిన శ్రీను, కొల్లు బాబూరావు తదితరులు కుమార్‌రాజాను అభినందించారు. తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన పార్టీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రిజినల్ కో ఆర్డినేటర్ మిధున్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల పరిశీలకుల పర్యటన

జగ్గంపేట: జగ్గంపేట అసెంబ్లీ సెగ్మెంట్ ఎన్నికల పరిశీలకులు రాజేష్ జోగ్పాల్ గురువారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. ఎన్నికల ఏర్పాట్లపై నియోజకవర్గ అధికారులతో సమీక్షించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఓ శ్రీనివాసరావు,వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

గండేపల్లి: రెప్పపాటుతో ప్రాణాపాయం త్రుటిలో తప్పి స్వల్పగాయాలతో బయటపడ్డ వైనమిది. మండలంలోని గండేపల్లి శివారు జాతీయ రహదారిపై డాబా వద్ద జరిగిన ప్రమాద వివరాలు ఈ విధంగా వున్నాయి. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం అయ్యవారిపోలవరం నుంచి నాదెండ్ల కృష్ణ తదితరులు కారులో గురువారం అన్నవరం దైవదర్శనానికి బయలుదేరారు. డ్రైవరుకు కునికిపాట్లు రావడంతో ముందు వెళుతున్న లారీని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు స్వల్పగాయాలు కాగా డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. ప్రమాద స్థలం వద్దకు చేరుకున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది క్షతగాత్రులను రాజానగరం జీఎస్ఎల్‌కు తరలించారు. స్తంభించిన ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి సరఫరాలో మార్పులు

తుని: వేసవిని దృష్టిలో పెట్టుకుని పట్టణ పరిధిలో తాగునీటి సరఫరాలో మార్పులు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు గురువారం తెలిపారు. ఉదయం సమయంలో మార్పులు లేవని, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకూ నీటి సరఫరా జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ధర్మవరం గ్రామ శివారున గురువారం జరిగిన ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందినట్టు స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... బెంగళూరు నుంచి కలకత్తాకు పార్సిల్ లోడ్‌తో వెళుతున్న లారీ ముందు వెళుతున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో బీహర్ రాష్ట్రానికి చెందిన పార్సిల్ లోడ్ లారీ డ్రైవర్ గౌతమ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన గౌతమ్ కుమార్‌ను చికిత్స నిమిత్తం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

- జిల్లా అదనపు ఎస్పీ భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ భాస్కరరావు

కోటనందూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎంపీ భాస్కరరావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని బొద్దవరంలో గురువారం సాయంత్రం ఎన్నికల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమన్నారు. ఎంతో విలువైన ఓటును ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ఉండాలన్నారు. ఎన్నికల వేళ అల్లర్ల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ఓటర్లంతా విధిగా పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో తుని రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి, ఎస్సై బి.శంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి

- మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా
- ఎ.కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారం



ఎ.కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా



ఎస్.అన్నవరంలో వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులతో మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: సంక్షేమ పథకాలను పేద, మధ్యతరగతి ప్రజల ఇంటికే అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. మండలంలోని ఎ.కొత్తపల్లిలో గురువారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గడప గడపకూ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మంచి చేయాలనే ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు, వైఎస్సార్ ఆసరా, జగనన్న ఆరోగ్య సురక్ష, అమ్మఒడి, జగనన్న చేయూత వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ఎన్నికల హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ పేట, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, సాలిపేట రామాలయం వీధి తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం సాగింది. అడుగడుగునా మహిళలు ఆయనకు హారతులిచ్చి స్వాగతం పలికారు.

వైఎస్సార్ సీపీలో 25 కుటుంబాల చేరిక

సీఎం జగన్ పాలన, మంత్రి రాజా నాయకత్వానికి ఆకర్షితులైన 25 కుటుంబాలు గురువారం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. మంత్రి దాడిశెట్టి రాజా సమక్షంలో ఎస్సీపేటలో టీడీపీ నాయకులు దడాల అశోక్‌వర్ధన్, బండి చిట్టిబాబు, పల్లపు వీధిలో కామిరెడ్డి సింహాద్రి, చీకట్ల చక్రరావు తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి రాజా పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ విజయానికి సమిష్టిగా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగాభవానీ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం గంగబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు, మండల బూత్ కమిటీ కన్వీనర్ బెక్కం చంద్రగిరి, సర్పంచ్ బెక్కం రాజా వరలక్ష్మి, పార్టీ నాయకులు సాపిశెట్టి చిన్న, వనపర్తి సూర్యనాగేశ్వరరావు, ఎంపీటీసీలు నందెపు చిన్న, ఎగులబంటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

తుని: ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆకర్షితులపై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో గురువారం మండలంలోని తేటగుంటకు చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు గొల్లపల్లి ఈశ్వరరావు, పేరూరి కిశోర్, గొల్లపల్లి రాంబాబు ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి రాజా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం కోసం కృషి చేయాలని రాజా సూచించారు. గొల్లపల్లి నూకరాజు, కోన పెదకాపు, ఎం.రాంప్రసాద్, నాగు, అమర్ కోననాగు, నానాజీ, సతీష్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎ.కొత్తపల్లిలో పార్టీలో చేరిన వారితో మంత్రి రాజా

పథకాలు అందాలంటే జగన్ మళ్లీ సీఎం కావాలి



ప్రత్తిపాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రత్తిపాడు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి అన్నారు. ప్రత్తిపాడులో గురువారం వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, గ్రామ ఉపసర్పంచ్ మదినే నూకరాజు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, పార్టీ నాయకులు పిని శెట్టి ప్రకాష్, ఇసుకపాటి సత్తిబాబు, కడుగుల అప్పలకొండ, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



మల్లేపల్లిలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న తోట ప్రసన్న, శ్రీనిధి



చిల్లంగిలో ఎన్నికలో ప్రచారం చేస్తున్న తోట రాంజీ

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు రాంజీ
- చిల్లంగిలో ఎన్నికల ప్రచారం

కిర్లంపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ అన్నారు. మండలంలోని చిల్లంగిలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అడారి మహేష్, దిడ్డి భద్రరావు, మద్దాల రాంబాబు, సంఘన వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, వేగి రామకృష్ణ, పాముల చంటి, కర్రి వెంకటరమణమూర్తి, దోమాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ధ్యేయం

గండేపల్లి: మహిళల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం కూతురు ప్రసన్న, కోడలు శ్రీనిధి అన్నారు. మండలంలోని మల్లేపల్లిలో గురువారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, మాజీ జెడ్పీటీసీ బిత్రా గిరిబాబు, పోతుల అర్జున్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జననేత జగన్ వెంటే జనం



లింగంపర్తిలో పార్టీలో చేరిన వారితో వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- వైఎస్సార్ సీపీలో 100 కుటుంబాల చేరిక

ఏలేశ్వరం: సంక్షేమ ప్రదాత, జననేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ప్రజలందరూ ఉన్నారని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. లింగంపర్తిలో ఆయన ఇంటి వద్ద గురువారం ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన వంద కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరికి వరుపుల సుబ్బారావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. సీఎం జగన్ పాలనలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాయన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలంతా సీఎం జగన్‌కు మద్దతుగా నిలుస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ మూడోసారి విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వరుపుల సూరిబాబు, రామిశెట్టి నాని, దారా నూకరాజు, కొప్పన గంగారావు, గొల్లపల్లి దొరబాబు, ఏనుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల స్వీకరణ



తునిలో నామినేషన్ వేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి దాడిశెట్టి రాజా



జగ్గంపేటలో రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేస్తున్న తోట నరసింహం

- ఎన్నికల్లో తొలిఘట్టం పూర్తి
- నేటి నుంచి నామినేషన్ల పరిశీలన

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో మొదటి ఘట్టం ముగిసింది. ఈ నెల 18న ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ గురువారంతో ముగిసింది. శుక్రవారం నుంచి నామినేషన్ల పరిశీలన ప్రారంభం కానుంది. ఈ నెల 26, 27, 28 తేదీల్లో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో దాఖలైన నామినేషన్లను అధికారులు పరిశీలిస్తారు. నామినేషన్ల పరిశీలనకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రత్తిపాడు సెగ్మెంట్‌కు 18 మంది 30 సెట్ల నామినేషన్ల దాఖలు

ప్రత్తిపాడు అసెంబ్లీ స్థానానికి గడువు ముగిసే సమయానికి 18 మంది అభ్యర్థులు 30 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. కాగా చివరిరోజు గురువారం దాడిశెట్టి వీరబాబు (జై భీమ్ పార్టీ), ఏడిద వరప్రసాద్ కుమార్ (రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా-ఎ), గొంప శివ (భారత చైతన్య యువజన పార్టీ), బత్తిన సింహాచలం (సమాజ్‌వాదీ పార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా గొంతిన శివరాజా, నమ్మి గణేష్ నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు, టీడీపీ అభ్యర్థి వరుపుల సత్యప్రభ రెండేసి సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

జగ్గంపేట అసెంబ్లీ సెగ్మెంట్‌కు 17 నామినేషన్లు

జగ్గంపేట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల స్వీకరణకు గురువారంతో గడువు ముగిసింది. జగ్గంపేట అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి గడువు ముగిసే సమయానికి మొత్తం 17 నామినేషన్లు దాఖలైనట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. చివరి రోజు వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట నరసింహం మరో రెండుసెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. ఆయన సతీమణి వాణి తరఫున వైఎస్సార్ సేవా దళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం మరో రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కార్యక్రమంలో నియోజవర్గ ఎన్నికల కార్యాలయ హెడ్ అత్తులూరి సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

తుని: తుని అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేవీ రామలక్ష్మి తెలిపారు. ఈ నెల 18 నుంచి 25 వరకు 30 సెట్ల నామినేషన్లు దాఖలైనట్టు చెప్పారు. గురువారం వైఎస్సార్ సీపీ అభ్యర్థి దాడిశెట్టి రాజా, టీడీపీ అభ్యర్థులు యనమల దివ్య, యనమల రామకృష్ణుడు, ఇతర పార్టీలకు చెందిన 9 మంది నామినేషన్లు వేశారన్నారు. శుక్రవారం నుంచి నామినేషన్ల పరిశీలన ప్రారంభమవుతుందన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టండి

- మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా సతీమణి లక్ష్మీచైతన్య
- ఎస్.అన్నవరంలో ఎన్నికల ప్రచారం



ఎస్.అన్నవరంలో ప్రచారం చేస్తున్న మంత్రి రాజా సతీమణి లక్ష్మీచైతన్య

తుని రూరల్: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో మళ్లీ పట్టం కట్టాలని రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సతీమణి లక్ష్మీచైతన్య పిలుపునిచ్చారు. మండలంలోని ఎస్.అన్నవరంలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, మహిళా కార్యకర్తలతో కలసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతల లక్ష్మణ్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, నాయకులు కుసనం దొరబాబు, వంగలపూడి కృష్ణారావు, వంగలపూడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి రాజా ఎన్నికల ప్రచారం

తుని: రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా శుక్రవారం తుని పట్టణంలోని 29, 30 వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు గురువారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ప్రచారం ప్రారంభమవుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సునీల్ నామినేషన్‌కు తరలివెళ్లిన నేతలు



ఏలేశ్వరంలో కార్ల ర్యాలీని ప్రారంభిస్తున్న వరుపుల రాజబాబు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్ కాకినాడలో గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్ ర్యాలీ, కార్యక్రమానికి ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు పిలుపు మేరకు ప్రత్యేక వాహనాల్లో వందలాది కాకినాడ వెళ్లారు. ఏలేశ్వరంలో వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్ల ర్యాలీని వరుపుల సుబ్బారావు తనయుడు రాజబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాకినాడ పార్లమెంట్‌తో పాటు ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ విజయ కేతనం ఎగుర వేస్తుందన్నారు. ర్యాలీలో సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రౌతులపూడి మండలం నుంచి..

రౌతులపూడి: వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ నామినేషన్ కార్యక్రమానికి రౌతులపూడి మండలంలోని 26 గ్రామ పంచాయితీల నుంచి 100 పైగా కార్లు, సుమారు 200 మోటారు సైకిళ్లపై పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కాకినాడ వెళ్లిన వారిలో జెడ్పీటీసీ గొల్లు చినదివాణం, పార్టీ ముఖ్యనేత వాసిరెడ్డి జమీలు, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, పార్టీ జిల్లా కార్యదర్శి కాకి నాని, మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ తదితరులు ఉన్నారు.

కిర్లంపూడి మండలం నుంచి..

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ నామినేషన్‌కు మండలం నుంచి భారీ ర్యాలీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ ఆధ్వర్యంలో కిర్లంపూడి నుంచి సుమారు 80 ఆటోల్లో కాకినాడకు జనం తరలివెళ్లారు. వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, చదలవాడ బాబీ, యాదవ సంఘం ప్రెసిడెంట్ ఇసరపు సూరిబాబు, రాపేటి ప్రసాద్, యల్లపు శివ తదితరులు ఉన్నారు.

మలేరియా మహమ్మారిని తరిమేద్దాం



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న కమిషనర్ శివప్రసాద్, సిబ్బంది

ఏలేశ్వరం: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కె.శివప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్ మీదుగా బాలాజీచౌక్ వరకూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియాకు కారణమైన దోమలను నిర్మూలించాలన్నారు. మలేరియా లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వాసుపత్రి, విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వెళ్లి పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలన్నారు. మలేరియా సోకకుండా ఆరోగ్యజాగ్రత్తలు పాటించాలన్నారు. మలేరియా నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. మున్సిపల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్, సబ్‌యూనిట్ అధికారి ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏవీ నగరంలో అవగాహన ర్యాలీ

తొండంగి: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండలంలోని ఏవీ నగరంలో గురువారం వైద్యారోగ్యశాఖ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యులు పి.రవికుమార్, భారతి ఆధ్వర్యంలో సిబ్బంది ప్లకార్డులు, బ్యానర్‌తో ర్యాలీ చేశారు. మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

గోకవరం: అంతర్జాతీయ మలేరియా నివారణ దినోత్సవాన్ని గురువారం కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిఖిత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ చేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్ నిఖిత, ఎంపీహెచ్‌ఈఓ డీఎస్ మూర్తి, ఎస్.శంకర్ మాట్లాడుతూ దోమల నివారణకు ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీలు అరుణోనమ్మ, రాజేశ్వరి, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.